# నిర్వికల్ప ప్రేమ

(కథానిక)

"ఆనాటి ఘటనను మరచిపోయేందుకి ఎంతగానో ప్రయత్నించాను. స్వర్గక్షేత్రాల్లోకి ప్రవహించవలసిన నా జీవన స్రవంతిని మరుభూముల్లోకి మళ్లించిన ఆ సంఘటనను ఎల్లా మరవటం? అసలు మానవునికి స్మృతి జ్ఞానమెందుకివ్వబడిందో...

కొబ్బరి ఆకు సందుల్లోంచి వెచ్చగా సూర్యకిరణాలు వచ్చి మీద పడుతున్నయ్. గంట 5-15 అయింది. ఐదుకే వస్తానన్న నువ్వు రాలేదప్పటికి. స్నానంచేసి వచ్చి పక్కనుండే హిందూ తిరగేస్తున్నాను. ఓ యువకుడి ఫొటో, దానికింద ఈ క్రింది విధంగానూ ఉంది. 'ఈ కుర్రాడి అడ్రసు చెప్పి అతనితో ముఖాముఖి సంభాషణకి వీలు కలుగచేసిన వాళ్ళకి రూ. 50 బహుమానం' కుర్రవాడితో, 'నాన్న మంచం పట్టాడు దిగులుతో. ఇంటికి రా. నీ వివాహాన్ని గూర్చి ఏమీ విచారించ నక్కరలేదు.' కుర్రవాడి ఫొటోవైపు చూచాను. అందంగా ఉన్నాడు. కళ్ళల్లో ఓ వేదన, నైరాశ్యమూ ఉన్నయ్. ఏ శుభాంగినికై రుధిర స్రవంతుల్ని సృజించాయో ఆ కళ్లు! పాపం, అమాయకుడు! సంఘాన్నీ తలిదండ్రుల్నీ ఎదుర్కోలేక పారిపోయాడు! రంగడు వచ్చాడు. బీచికి వస్తావా అన్నాడు. నీ సంగతి చెప్పాను. 'వాడింకేం వస్తాడు, మనం పోదాం పద' అన్నాడు. వాడు సతీ సమేతంగా తరలాడు. ఇక రావనటం బావుండదని వెంబడించాను. కొత్తగా కాపరానికి వచ్చిన భార్య. కంటికి కనుపించే ప్రతి సూక్ష్మ వస్తువులోనూ శృంగారోద్దీపన భావాలు గోచరిస్తాయి; (కదూ?) మాటల కందని భాషలో మాటాడుకుంటారు. ఇక నే నెల్లా వెంబడి ఉండడం? కళ్లు మూసుకొని దూరదూరంగా జరుగుతూ, ఎల్లాగో బీచికి వచ్చాము. వేయినాల్కలు చాచి విషాన్ని కక్కే నాగేంద్రుడిలా ఉన్నాడు సముద్రుడు.

వాళ్లు నీళ్ళదగ్గరకు వెళ్ళారు. నే నక్కడ ఓ దూలం మీద కూలబడి చుట్టూ కలయ చూశాను.

చిత్ర వర్ణాలతో శోభించే మంజులాకాశం, ఉవ్వెత్తుగా లేచి నింగినంటే అలలతో గంభీరమైన ఈ సముద్రం, అలల నాలింగనం చేస్తో నటించే కమ్మ తెమ్మెరలు, తీరంలో, శంఖ స్పర్శనే ఎరుగని ఆనంద ప్రకృతి-ఇవి చాలవూ హృదయాన్ని కంపింపచేసేందుకి?

తీయని అనుభూతులు సృజించిన మధుర స్వప్నాలు కాలభ్రమణంతో అవ్యక్తమైన బాధలుగా పరిణమిస్తయ్. ఆదిలో ఆ కలలు కొనసాగని కోర్కలై జీవితాన్ని వ్యథామయం చేస్తయ్. ప్రతి అనుభూతికీ అలవాటయిపోయే ఈ మానవ మనోయంత్రం కొంత కాలానికి తపించటం, దుఃఖపడటం మానుకుంటుంది. అవి తాత్కాలికంగా నిద్రాణమై మనో సముద్రంలో ఒక మూల అణగిపడి వుంటయ్. ఒకరోజు ఏదేని మనోజ్ఞమైన సుందర ప్రకృతి మనస్సును కదిలిస్తే, ఆ గతానుభూతుల స్మృతులు మంచు తెరల్లాంటి కాల ప్రవాహాన్ని ఛేదించుకుంటూ మనో ఫలకంలోనికి, తీరంలోనికి అలల్లా, దొర్లుతూ ప్రవహిస్తయ్. బాహ్యమైన ఈ సుందర ప్రకృతికీ అంతరంగికమైన నిర్వృతి నందని కాంక్షలకీ ఎందుకో ఈ సంబంధం! ఇక కృష్ణవేణి నాకు గుర్తుకు వచ్చిందంటే విశేష మేముంది (అసలామెని నేను మరచిందెప్పుడూ?) కాని, ఎంతగా మోసం చేసింది? ఎన్ని బాసలు, ఎన్ని ప్రమాణాలు! ఎంతగా నమ్మించింది! ఆమె మనస్సు నామీదనే ఉన్నదట. నేను ఆమె ప్రేమశ్రీ

నట! తాను ఇంటిదగ్గరనుంచి ఎంత దిగులుగా వస్తుందో తెలీదట. కాని నన్ను చూచిన వెంటనే ఆ దిగులు ఎలా పోతుందో! ఒక్క రోజు కనపడకుంటే "నీవు మరీ అగపట్టమే లేదు. నీ కోసంగా వేయికళ్ళతో చూస్తుంటేదాన్ని" అని అంటుంది. సెలవలు ఇస్తే "ఈ సెలవులు ఎలాగడిపేది? పోనీ,నాకోసంగా ఊరికిపోవడం మానుకోరాదూ? అవును, మానుకొనకతప్పదు. నువ్వు రోజుకోసారైనా నాకు కనపడి తీరాలి. అయినా నే నెందుకు నిన్ను శాసించడం, నీ యిష్టం" అని రాసేది.

పరీక్షలని పేనా అడిగితే ఇచ్చాను. ఇంటికి వెళ్ళి "నీవు పేనా ఇచ్చి సహాయం చేసినందుకు కృతజ్ఞురాలిని. నీ మేలు నేను మరచిపోలేను. నీ పేనానుచూస్తే నిన్ను చూచినట్లువుంటుంది" అని ఏమేమో రాసింది, నేనుతనకి పేనా బహుకరించినట్టు. బహుశా, మోజు పడిందేమో అని నేనా పేనా అడగదలచుకోలేదు. కాని పరీక్షలు కావటంతోటే ఆ రోజు ఆఖరు పరీక్ష అవగానే "సాయంత్రంవచ్చి పేనా తీసుకువెళ్లు" అని చెప్పింది. నవ్వు వచ్చింది నాకు, ఈ భాగ్యానికా అంతగా రాయటం అని. సాయంకాలం వెళ్ళలేదు నేను. మరునాడు పొద్దున వచ్చి "మా అన్నయ్య చూస్తే యేమనుకుంటాడు? నీ పేనా నువ్వు తీసుకో" అని అక్కడ పడవేసి పోయింది. ఆ రోజు, ఆమెకి నా పేనా యిచ్చేనాడు ఆమెకి బహుకరించే ఉద్దేశంతో ఇవ్వకున్నా, ఆమె పేనామీద అల్లిన కవిత్వం చూచి "పోనీలే ఉంచుకోనీ" అనుకున్నాను. కాని ఆమె ఈలా అప్పళం విరిచినట్టు విరసోక్తి విసుర్తుందనుకోలేదు. తరవాత మూడు రోజులు అవలేదు. నాలుగో రోజు వచ్చి "ఏం, కోపం వచ్చిందా, పేనా తీసికోలేదని!" అంది. "నీ మీద నాకెందుకూ కోపం? అసలదేం నీపేనా గనక నా!" అన్నాను. "అలాగా" పేనా తీసికొని బుగ్గమీద చిటికెన వేలితో చిటికవేస్తో గది నిండా శరచ్చంద్రికల్ని వెదచల్లింది.

* * *

అందమైన వస్తువు కనిపిస్తే చూడటమే మానవ సహజం. అది ఓ విధమైన మానసిక తృప్తినిస్తుంది. ఆ చూపుల వెనక 'వాంఛ' ఉంటే వుండవచ్చు. కాని అది ఉండితీరాలి అని లేదు. సౌందర్యోపాసన మనకు తరతరాలుగా వస్తోంది. అది మన నెత్తుర్లోని ప్రతి కణంలోనూ సజీవంగా ఉంది. అయితే కారణం లేని కార్యం అంటూ ఉండదు. ఇక అన్ని కార్యాలకీ మూలం సెక్స్ ఇంపల్స్ అనటం ఎంతవరకు సమంజసమో నాకు తెలీదు. ఒక మహోత్కృష్ట శిల్పాన్ని చూస్తాం; ఆనంద తరంగితుల మౌతాం. అలా ఆనందించటం కాముకవాంఛతో నేనా? సైకో ఆనాలిసిస్ చొప్పున "ఆ వాంఛ అన్ కాన్షస్ లో ఉంటుంది. కాన్షస్ లోకి ప్రయాణం చేసే సరికి పరిసరాలు, సంఘమూ, నీతి, కట్టుబాట్లు ఆమోదించే ధ్యానంగా (ఇక్కడరూపలాలసగా) రూపొందుతుంది" (ఈ ప్రోసెస్ కి "సబ్లిమేషన్" అంటారు.) అని అంటే అనవచ్చు. కాని నేను ఆమెను మొదటసారి చూచినపుడే ఆమె సౌందర్యానికి ముగ్ధుణ్ణి అయింది మాత్రం నిజం. ఆమెకప్పటికి పదునాలుగేళ్ళు. తొలి యవ్వనపుఛాయలు నునుసిగ్గు తెరల్లోంచి తొంగి చూస్తున్నయ్. తన నాదరించబోయే ప్రకృతి పరిణామాన్ని పసికట్టినదానికి చిహ్నంగా ఓ అవ్యక్తమైన ఆనందరేఖ కడకంటి దరహాస రూపంలో మిలమిలలాడుతో తరళకాంతితో మెరిసిపోయేది. దాన్ని మొదటిసారిగా నేను చూచినప్పుడు ఆనందంతో ఏవో అస్పష్ట రసాంచలాల్ని ఆస్వాదించాను...రూపానికి తోడు హృదయం కూడా ఎంతో సుందరమైందని తెలిసికొన్నప్పుడు ఆమెను వెళ్ళి అభినందించాలని ఎంత గాఢంగా వాంఛించానో! కాని ఆమె, నాతో, ఓ అపరిచిత వ్యక్తితో మాటాడుతుందా? అందులో ఆ సన్నివేశమేమంత గొప్పదని!—ఎవడో పిచ్చివాడొకణ్ణి కరిస్తే వాడు ఆపిచ్చివాణ్ణి తరిమి పట్టుకొని కొట్టబోతున్నాడు. చుట్టూ చేరిన జనం "హారాహుహార్" అనేవాళ్ళూ, పోలీసుల కప్పజెప్పమనేవాళ్ళే, కాని, ఆమె, ఆ పదునాలుగేళ్ళ కోమల హృదయం రసార్ద్రమై, జాలితో ద్రవించిపోయింది. "పాపం పిచ్చివాడు, కొట్టకండి" అంటూ బిగ్గరగా అరిచింది. ఈమాత్రం కర్త

ష్యతాజ్ఞానం కలగనందుకు చింతిస్తో అడ్డం దీశాను వాణ్ణి. అప్పుడు మళ్ళీ ఆ కృష్ణనేత్రాల లోయల్లోకి చూచాను. ఎందుకో ఆమాపుల్లో అంత తృప్తి, అంత కృతజ్ఞత!

మన దైనికజీవితంలో ఎందర్నో కలుసుకొంటూఉంటాం. వాళ్ళందర్నీ గుర్తుంచుకోటం గాని, వాళ్లతో పరిచయ మేర్పడటం కాని సంభవించదు. అట్లాగే ఆమెనూ నేను మరచిపోయేవాణ్ణే కాని, ఆమె మళ్ళీ ఓరోజు అక్కడే కనిపించటం, అనుకోని రీతిగా ఆమె కెమ్మోవిపై మల్లెపువ్వుల నవ్వు సుళ్లు తిరగటం ఒకేసారి జరిగిపోయాయ్. వెంటనే ఆ గడచిన ఘట్టం గుర్తుకురావటం "నిన్ను నేను మరచిపోలేదు సుమా" అన్నట్టు, నేను ప్రతిహాసం చేయటం, చాలా సహజంగా జరిగిపోయింది. ఆమె తన చిన్నినోరంతా తెరచి కళ్లు మూసి, పళ్ళికిలించి వెక్కిరించి నవ్వి పుస్తకాలెగరేస్తో పరిగెత్తింది, ఎన్నో సంవత్సరాల పరిచయమున్నట్టు!

ఆ తరవాత చాలాసార్లు ఆమెను కలుసుకుంటూ వచ్చాను. కనపడినపుడల్లా నవ్వుతూ కనుబొమలు ఎగురవేసేవాణ్ణి. ఆమె కళ్లుమాత్రం ఏవో అగాధపుటంచుల్ని అన్వేషిస్తో చలించేవి. ఒక్కొక్కనాడు విసుగులేకుండా గంటల తరబడి వేచివుండేవాణ్ణి ఆమెవస్తుందని; ఆమెవచ్చేది! ఆమె వదన శశికళని చిత్రించుకొని ఆదరహాస చంద్రికల వెల్లువలచల్లదనంలో మునిగి తేలుతో ఇంటికి వచ్చేవాణ్ణి. (దృశ్యమానమైన సన్నివేశాలకంటే అదృశ్యాలై, ఊహాయోగ్యమైన దృశ్యాలే మధురతరములు కదూ!) నేనల్లా విసువులేకుండా గంటలపర్యంతం కాచుకొని ఉన్నది ఆఒక్కచిఱునవ్వుకోసమే. అంతకంటే వేరే వాంఛించింది లేదు. బహుశా అంతకంటే ఆమెనుంచి, ఎక్కువగా ఆశించగలిగి ఉంటే ఇప్పుడీ విషాదపరిణామం సంభవించి ఉండేది కాదేమో! ఆరోజు ఆమె అక్కడే ఆ స్తంభం కింద నుంచోనుంది నేవెళ్ళేసరికి. అటూ ఇటూ చూచి పుస్తకంలోంచి ఓ కాగితం బయటకు తీసి తీసికొమ్మంది. అక్కడేవుండి ఇమ్మని చెయి చాచాను. ఆమె కళ్లు మూసుకొని నవ్వుతో, ఆ కాగితం మళ్లీ పుస్తకంలో పెట్టి నన్నావైపుకు రమ్మనిపిలిచింది. నేను నవ్వుతో నుంచున్నానే కాని వెళ్ళలేదు, ఆమెఈవైపుకు వస్తుందో రాదో చూస్తామని. కాని ఆమె రెండు నిమిషాలాగి వెళ్ళిపోయింది. మామూలుగా మరుసటిరోజు వచ్చాను. ఆమె కనిపించలేదు. ఆ మరుసటి రోజూ అంతే! అనుమానం వేసింది. కోపం రాలేదు కదా? వాళ్ళింటివేపు వెళ్ళాను. అక్కడాకనిపించలేదు. ఊళ్ళో లేదేమోననుకొని వస్తో తిరిగి చూచాను. వాకిట్లో నుంచోనుంది. నేను చూచేసరికి ముఖం పక్కకి తిప్పుకుంది. ఏం. కోపం వచ్చిందా? అవును, ఆ నిర్మలాకాశంలో అవిగో కోపమేఘాలు! అసలా రోజున నేనా జాబును గూర్చి ఆలోచించలేదు. ఆమె. అదేవో, ఇస్తానంది; చెయి చాచాను. రమ్మనింది ఏందుకో వెళ్ళలేదు. అంతే. కాని ఆమె ఇలా తీవ్రంగా తీసికొంటుందని నాకు తట్టనే లేదు. నవ్వు వస్తున్నది కమా నీకు? అవును. నవ్వవలసిన విషయమే. కాని నేనలా అనుకోక పోవటానికి కారణం కూడా లేకపోలేదు. నాకామెఎంతో చిన్నపిల్లగాకనిపించేది. చేష్టల్లో. మాటల్లో వెక్కిరిస్తో, కొంటెవేషాలు వేస్తో అచ్చం పసిపిల్లలాగే ఉండేది. అంచేత ఆమె చేసేపనులన్నీ బాల్యచాపల్యాల కింద జమకట్టేవాణ్ణి, ఇక ముభావంగా ఉండక ఏంచేయటం?... కాని ఆమెకి కోపంవచ్చింది! అసలా అమ్మాయి జాబు నేనెందుకు తీసికోవాలి? ఆమెని చూచి నందుకా? అమాయికత్వం ఉట్టిపడుతో ఎంతో అందంగా ఉంటుంది. ఆ గుండ్రని ముఖం చూడాలని ఎవరనుకోరు? ఆమె నవ్వుతోంటే. ఆమెకా నవ్వు రజనీదేవికి శశి కళ! కాని, ఆమె నామీద అలిగింది! (నవ్వు రావటం లేదూ?) అంటే, ఆమె ఎన్ని రోజులనుంచి ప్రయత్నిస్తోందో జాబివ్వాలని! అసలెన్నిమార్లు రాచి చించివేసిందో!

మరుసటిరోజు తప్పకుండా అక్కడికి వస్తుంది. ముందుగా వెళ్ళి ఎదురుచూస్తోన్నాను. దూరాన్నుంచే చూచి, తలవంచి నేల చూస్తో నడుస్తోంది. దగ్గరకు వచ్చిందాకా ఆగి; "బలే పిల్లవే! అయితే జాబేది?" అన్నాను. "రేపు" అంటో ముసిముసి నవ్వులు నవ్వుతో, వెనక్కి తిరిగి చూస్తో పరిగెత్తింది. అచ్చం, పసితనం!

ఇక ఈ అమ్మాయి నన్ను ప్రేమించింది అసలు ప్రేమ అంటే ఏమిటో తెలుసా? 'రింగ్ ఓన్సు' అనుకుంటుందేమో!

కాని ఆ వుత్తరం నేను ఎన్నిసార్లు చదివానో! బహుశా పదిసార్లు చదివివుంటాను. కాదా, యేభైసార్లు. చదివేకొద్దీ చవులూరిస్తో కావ్యమైన కవిత్వంలా ఉంది. అంటే ఆమెకి జాబు రాయటంలో అనుభవంగాని, ప్రావీణ్యం గాని ఉన్నాయనిగాదు. ఆ రెండూ ఉన్న వాళ్లు రాస్తే బహుశా నేను మెచ్చుకోలేక పోయి ఉండేవాణ్ణి.

"ప్రేమశ్రీ (!)"

పాపం, ఎక్కడ అల్లారాముాలో తెలీలేదు. ఎవరో కవికుమారుడు ఆమెకలారాసిఉంటాడు. పైగా అది ఎంతో అందంగా వుంది. ఇంకేం అలాగే అచ్చుగుద్దింది!

"మీ పేరు నాకు తెలీదు; కనక మీరు నన్ను కూడవద్దు..." ఏమితర్కం! శ్రీ శంకర భగవత్పాదాచార్యులు శుశ్రూష చేసింది ఈ కృష్ణకాంతి దగ్గిరేనా?

"మీరు నన్ను చూడవలెనన్న ఉదయం తొమ్మిదింటికి నేను ఇక్కడకు వస్తాను. దయచేసి ఈ టయిము ప్రకారం ఉండిపోవలెను..."

భేష్, బాగుంది; మౌంట్‌బాటెన్ స్కీము కంటే బాగుంది!

"సాయంత్రం మా వీధిన రావలెను... ఈ చీటిగు చూచిన వెంటనే త్వరగా జాబు రాయవలెను. మీరు నా వైపు దేనికి చూస్తారు?... ఈ సంగతులు చదువుకొని ఆనందించి (ఆమెకెంత నమ్మకం!) వెంటనే చించివేయవలెను. నా మీద కోరిక పోగొట్టుకోకూడదూ?... నా మనస్సు మీ మీదనే ఉన్నది. ఇన్ని ఉన్ననూ ఎవరికీ తెలియకూడదు... తెలిసిన... మీ

ప్రేమ శ్రీ"

జవాబు రాయటమా, మానటమా? రాస్తే అసలామె హృదయం తరవాత ఏ విధంగా పరిణమించేదీ తెలీదు.

"ఎంకరేజ్" చేస్తే, తరవాత "నేనింకొణ్ణి చేసుకోను" అని మొండి కెత్తితే? పోనీ, రాయకుంటే, పాపం! లేతమనస్సు ముక్కవోతుంది. నెమ్మదిమీద సవ్యమార్గం పట్టించవచ్చు.

నాకు తెలుసు, ఆ విధంగా ఏ కుర్రాడికి రాసినా అనవసరమైన అతిశయోక్తులతో నానా హంగామా చేసి, పంకంలోకి ఈడుస్తాడని. ఆమె జాబు చూచిన తరవాత నాకూ అల్లాంటి భావం కలగక పోలేదు. కాని అందమైన ఆ ముఖం, ఏవో ఊహాకందని లోతుల్ని స్పృశిస్తూ చలించే ఆ నల్లని కౌటుక కళ్ళూ, శుభ్రజ్యోత్స్నల్ని ఒలకబోసే ఆ నవ్వు పువ్వులూ చూస్తే, హే భగవాన్!

చాలామంది నన్ను ప్రేమంటే ఏమిటో ఎరగని మూర్ఖుణ్ణనీ, ప్రేమించటం చేతరాని శూన్య హృదయుణ్ణనీ అనుకోవచ్చు. ఎవరేమంటే ఏం లాభం? నేను ఆమెను ప్రేమించలేక పోయింది మాత్రం తథ్యం. ఎన్నో మాట్లు ఆలోచించాను "నే నేమాత్రమైనా ఆమెని ప్రేమిస్తున్నానా" అని. ఎంతగా తరచినా ఒక్క ప్రేమ కణమైనా కనిపించేదికాదు. పైగా నా సంశయానికి నాకే నవ్వు వచ్చేది! ఆ తరవాత నాకామె ఐదు జాబులు రాసింది. ఆ ఐదో జాబులో తన్ను మరిచి పోవద్దనీ, మెప్పించి మోసం చేయవద్దనీ, ప్రేమను స్వాగతం చేయాలనీ నా మనసులో ఉన్న సంగతులు చెప్పమనీ రాసింది. చాలాజాలిగా ప్రాధేయపడుతో రాసింది. అంత చిన్న వయసులో ఆమెకి తెలిసింది పుస్తకాల్లో చదివిన "ప్రేమే" అని అనుకున్నాను కాని, ఆమె ఇంత గాఢంగా ప్రేమిస్తుందని అనుకోలేదు. అది నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఇంతవరకు నాకామె మీద ఇది మిత్థమని నిర్ణయించటానికి వీలులేని అభిప్రాయాలుండేవి. కాని ఆ జాబు నా భావాల్ని తలక్రిందులు చేసింది. నేనామెను నాకు తెలియకుండానే ప్రేమిస్తున్నానా?... అసలంతగా ప్రేమిస్తూంటే ప్రతిప్రేమ నివ్వకుండా పోవటం సహజంగా జరుగుతుందా? అబద్ధం, హృదయం ఉంటే అలా ఎన్నటికీ జరగదు. అయితే ఆమెని నేను ప్రేమించగలనా? ఆమె అంతగా ప్రేమిస్తూంటే నేనామెను ప్రేమించకుండా ఉండటం అసాధ్యం. ప్రతిగా నేనూ ప్రేమించి తీరాలి. అవశ్యం ప్రేమిస్తాను. అసలామెని నేను ప్రేమించటం లేదా? లేకుంటే ఆమెకై గంటల తరబడి కాచుకుని ఎందుకుంటాను?

అయితే ఇన్నాళ్ళనుంచి ఎక్కడకు పోయిందా ప్రేమ? ఇవ్వాళే పుట్టుక వచ్చిందా? అబద్ధం. ఎన్నటికీ కాదు; అది ఇన్నాళ్ళనుంచీ నాలో ఉన్నదనే విషయం నాకు తెలీదు. ఈ రోజు తెలిసింది. అందుకు కారణం ఆమె కరుణా కంపిత స్వనమే. అది నా హృదయాన్ని స్పందింప చేసింది. మారుమూలల్లో దాగి ఉన్న మానవత్వాన్ని తట్టిలేపింది. నాలో జీర్ణించుకు పోయిన బూర్జువా సంస్కారం, సాంఘిక వ్యవస్థ భేదం నన్ను ఆమెకంటె మిన్న అనే తలంపుల్లో ఉంచింది. పైగా దురదృష్టవశాత్తు ఆమె పసితనం ఆమెకి ప్రేమ తెలీనిస్తుందనుకోలేదు. అది బాల్య చాపల్య మనుకున్నాను. కాని ఆమె రాసిన ఆ జాబులోని ప్రత్యక్షరం, ప్రతి పదం, ప్రతి వాక్యం సువ్యక్తం చేసిన ఆమె వేదన, ఆరాటం, ఉద్వేగం, ఉద్రేకం నాలోని జీర్ణభావాల్ని క్షాళనం చేశాయి. వాటితో నాలోని ఇడ్ సూపర్ ఎగోని జయించింది. అనుక్షణంలోనే అది ఎగోగా రూపొందింది. ఆమెను నేను ప్రేమిస్తున్నాను! ఇంక నా హృదయం చీల్చి అందులో ప్రవహించేది రక్తం కాదనీ ప్రణయ సుధ అనీ నిరూపిస్తాను.

కాని ఏంలాభం? సమయం మించిపోయింది. ఆమె తన భావాలకనుగుణంగా వర్తిస్తాడు అనుకునే ఓ యువకుడికి తనహృదయాన్ని అర్పించుకుంది. కాని, హృదయాన్ని నేను విప్పి "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని ఆమెతో చెప్పిన తరవాతే ఆమె తన మనస్సు మార్చుకుందా? అయితే, తప్పంతా ఆమెదే. రాగస్నిగ్ధమైన ఒక మానవ హృదయాన్ని ఆట వస్తువుగా చేసి, అపహసించినవనే నైచ్యము ఆమెకి తప్పకుండా వస్తుంది. కాని నేను చేసిన తప్పల్లోకల్లా తప్పు, ఆమె, నీ మనసులో ఉండే విషయ మేమిటో చెప్పమన్నప్పుడు వెంటనే చెప్పకపోవటం. ఆ చెప్పిందైనా డొంక తిరుగుడుగా చెప్పటం. కాని ఆమెని నేను తీవ్రంగా ప్రేమిస్తున్నానని అర్థం వచ్చేటట్టే రాశాను. "కృష్ణా, నవ్వు నిజంగా కృష్ణవు; ముగ్ధమోహన కృష్ణవు. నీ పేరు వింటే నా హృదయం స్పందిస్తుంది. నిన్ను చూస్తే అవ్యక్త రాగా లాలపిస్తుంది. నల్లని యమునా స్రవంతివలె తీయని వేణు రవమట్లు, సుందరమైన బృందలా నీ ప్రేమలో కరగిపోదలచుతాను. కాని కృష్ణా, నేను వాంఛించినంతగా నిన్ను ప్రేమిస్తున్నానా? ఏమో! ప్రేమించినంత గాఢంగా వచించలేకపోతున్నాను. అసలు భావాలలోతుల్ని వెల్లడించేందుకు ఈ మూగ భాషకేం చేతౌతుంది? నీ ప్రేమలో నాకు శ్రీకృష్ణుడు కనిపిస్తోన్నాడు; నిన్ను ఒక గోపిక, బృందవలె ప్రేమించగలను. కాని ప్రియా రాధ ప్రేమలోని సౌందర్యమూ, 'ఆమె కళ్లలోని ఉత్కంఠా, నేనెన్నడైనా అందుకోగలనా" రాశాను పిచ్చిగా.

దివ్యమైన రంగులతో సుందరమైన ఓజః పూర్ణమై, రాగరంజితమైన ఈ సుప్రభాతం— ఎందరో సుప్తజీవుల్ని జాగృతంచేసి వారి జీవన మరుద్వానాల్లో ప్రేమ నొలికించి, అమృతాన్ని చిలికించిన ఈ దివ్య ప్రభాతం— నా కోపాదగ్గర నుంచి ప్రత్యుత్తరం తెప్పించలేక పోయింది. కాంక్షా కలితమైన చిత్తంతో, నిరాశోన్ముఖమైన మనస్సుతో ఒక రమణీయ ప్రభాతం కమ్మని వార్త నందిస్తుందని ఆశించాను కాని రంగుల గారడీలు చేసే ఈ ప్రభాతం దివ్యతేజోమయమైన అహస్సు కుమారుగా నిరంతర సాంధ్యరాగాన్ని చిత్రించింది. శోణారుణిమ శ్యామలమై, కాలమై, అనంతమైన కృష్ణ పక్షంలో సంగమించింది.

పొర వీడిపోయి మళ్ళీ లోకంలో పడ్డాను. ఎక్కడో ఓ యువకుడి నవ్వూ, ఓ కుక్క అరుపూ వినిపిస్తున్నయ్. అంతా కల! సుషుప్తి పోయింది. మత్తుకూడా వదిలింది. మళ్ళీ అయ్యారు పెట్టబోయే తిండి రుచులూ—ఎంత వేదనలో ఉన్నా ఈ బండికింత బొగ్గు అవసరం కమా!— ఆలోచించుకుంటూ స్టాండుకు వచ్చాను.

కృష్ణవేణి కనిపించింది! వెంట ఒక యువకుడున్నాడు. ఇక్కడ ఈ సమయంలో ఎందుకు ఉంది ఆమె! బహుశా ఆలాంటి యువ మో? మళ్ళీ చూశాను. ఈ నీడలో సరిగా కనిపించటం లేదు. సిగరెట్ల అలవాటు లేనందుకు హృదయ పూర్వకంగా విచారించాను.

ఐనా, ఇప్పుడామె ఎవరైతే యేం! పోనీ కృష్ణవేణే అనుకుందాం. ఆమెకి నాతో ఇప్పుడు

పనిలేదు. పైగా నా ఉనికి ఆమె ఆనందాని చెలియలి కట్ట వేస్తుంది. అయినా నన్ను తిరస్కరించిన తరవాత ఆమె ఆనందంతో నా కేం పని! కాక, ఉండి నేను బావుకునే దేమిటి? నిజంగా ఆమే అయితే నా మనస్సు నా స్వాధీనంలో ఉంటుందో, ఉండదో? ఉద్రేకం వచ్చి ఏమంటానో? పక్కనున్న అతనెవరు?— అతణ్ణేంచేస్తానో? ఎందుకేనా మంచిది అని అక్కణ్ణుంచి వెళ్ళబోయాను. కాని మనసు ఆమెను చూచేందుకి రెపరెపలాడింది, వీలైతే ఆమెతో మాటాడాలనీ లేకుంటే ఒకసారి చూడనైనా చూడాలనీ. ఆమెకు ప్రియుడేనా అతను? అయితే అతణ్ణి కూడా ఓ మాటు చూడవచ్చు. అతనామె ప్రియుడే అయితే సభ్యంగా ప్రవర్తిస్తానా. కాని, ఆమెపట్ల నాకు అచంచలమైన ప్రేమ ఉంటే, అదే నా సభ్యతకి పూచీ పడుతుంది గాక! ఆఖరికి నా ప్రేమ వైశాల్యమైనా తెలుసుకుంటాను.

బస్సు కదలబోతోంది, పరుగెత్తి ఎక్కాను. లోపల జాగా లేదు. నుంచొని చుట్టూ మాశాను. సరిగా చూచాను. చెమ్మగిలిన కళ్ళను తుడుచుకొని మళ్లీ చూచాను అనుమానం లేదు; ఆమే! కాని సత్యం, ఊహించుకోగలవూ, అప్పుడు నా భావాలెల్లా ఉండేవో? నా చేతులు కంపించాయనీ, మేను గగుర్పొడిచిందనీ, కళ్ళు ఎర్రబడ్డాయనీ, ఒళ్లంతా చిరుచెమటలు కమ్మాయనీ... అనుకుంటున్నావు కదూ! ఒట్టిది, అల్లాంటిదేమీ లేదు. కాని, ఆమె పక్కనున్న యువకుడెవరా అని ఆశ్చర్యంతో చూచాను. ఆమె ఏరి, కోరి వరించిన ప్రియుడేనా? అనుమానం. కాని కాకపోయేందుకి వీల్లేదు. అయితే అతడిలో ఏ గురుత్వాకర్షణ జనించి ఆమె నా వైపుకు సమాకర్షించిందో! ఈ మాటల్ని నేను "ఈసు"తో అనటం లేదు. అతను ఆమె కెన్నటికీ తగడు. ఆమె ఓ అమృత కిరణశకలం. అతను రాహువు. నే చెప్పను, తర్కం నిస్వార్థపుటం చల్లి అందుకోలేదంటే నే రాసే ప్రతి అక్షరం అసత్యమే అవుతుంది.

"అందం శరీరానికి మాత్రమే సంబంధించినది" అంటే అతను అందగాడు కాదు. కాని అది మనస్సుకు చెందింది అంటే అతను ఎంత అందగాడో! ఆ అందాన్ని కొలిచేందుకు సా నాదగ్గిర కొలతబద్దలేదు; నా కతను పూర్తిగా అపరిచితుడు. ఇంతదాకా ఆమె నన్ను చూడలేదు; అటు వేపుగా తిరిగి ఉంది. ఇక ఆమె చూడకపూర్వమే వెళ్ళిపోదామనుకున్నాను. కాని ఆమె నన్ను ఈ సమయంలో చూస్తే? నన్నామె చూడటానికి ఎన్నడూ అంగీకరించదు; ఒకవేళ చూస్తే ఎలా "రియాక్ట్" అవుతుందో? నిజమే ఇది పిచ్చి ఆలోచన. కాని ఆమె నన్ను ఎందుచేత తిరస్కరించిందో తెలీదు. అతనికి తననెందుకర్పించుకుందో అంతకుముందే తెలీదు. ఇక ఆ పరిస్థితుల్లో వాళ్లు ఇద్దరూ ఉన్నప్పుడు ఆమె నన్ను చూస్తే ఎలా చలిస్తుందో? ఆమె ముఖ కదలికలు ఆమె నన్ను తిరస్కరించిన దానికి కారణం సూచిస్తాయేమో? చివరకి ఒకసారి, సానుభూతి పూర్వకంగానైనా చూడకపోతుందా? దానివల్ల నీకు వొచ్చే ప్రయోజనమేమంటావేమో! ఏమీలేదు. కాని ఏం చెప్పను?

ఆమె నన్ను చూచింది. క్రమంగా ఆశ్చర్యము, వైవర్ణ్యమూ, విషాదమూ, కరుణా ఆమె ముఖంలో— తెరమీది బొమ్మల్లా— దూరం పోవటం గమనించాను. కాని ఒక్క క్షణంలోనే, అనుక్షణంలో ఆమె ముఖంలో విపరీత హాస్యం అంకురించింది. నన్ను చూచి పరిహాసపూర్వకంగా నవ్వుతో, అతని ముంజేతిమీద తన ఎడమచేయి వేసి మెల్లగా జారుస్తో తల పక్కకి తిప్పుకుంది! సన్నగా దగ్గాను. ఆమెకా దగ్గు చిరపరిచితము.

ఆమె నన్ను చూచి జాలిపడకున్నా నేను చింతించి ఉండను. కాక నన్ను చూచి దూషించినా నే బాధపడి ఉండను. కాని ఆమె నన్ను హేళన చేసింది. కడుపులో కరుడుగట్టిన ద్వేషాన్నంతా ఒక్క పెదవి విరుపుతో, ఒక్క హస్తచాలనంతో ఒలకపోసింది. నే నేం ద్రోహంచేశా నామెకి? ఆమె అర్థించినరోజుల్లో ఆమెని ప్రేమించలేకపోయాను. అది నా తప్పు కాదు. కాని ఆమె ప్రేమలో నైర్మల్యము కూలంకషత్వమూ ఉన్నవనుకున్నపుడు గతానికి విచారించాను. ప్రతిక్రియగా ఆమెని నా శక్తి కొద్దీ ప్రేమించేందుకి ప్రయత్నించాను. నిజానికి ఆఖరురోజుల్లో నా పేమ పొంగి, సుళ్లు తిరిగి

గుతో, కరుళ్లు కట్టుతో, ఉవ్వెత్తుగా లేస్తో, ఉరకలువేస్తో మహా నిర్ఝరిణిలా ప్రవహించింది. ఆ మహావాహినిలో ఆమెనీ, నన్నూ, విశ్వాన్నే మరచిపోయాను. కాకుంటే ఆమె జీవితాన్నే నాశనంచేసి ఉండేవాణ్ణి. నేనన్యథా వాంఛించి ఉంటే ఆమె ఈనాడు అతని సరసని కూచొని నన్నలా గర్వంతో అపహాస్యం చేసి ఉండేది కాదు. ఏనాడో నా ద్వేషానలానికి ఇంధనమై పోయి ఉండేది. ఆమెనీ, ఆమె గర్వాన్నీ కూకటివేళ్ళతో పెళ్ళగించి నా ప్రతిక్రియా క్రతువులో హవిస్సునుచేసి వ్రేల్చి ఉండేవాణ్ణి. కాని నేను క్షుద్రుణ్ణికాలేను. ఆమె నన్ను ప్రేమించనీ, ద్వేషించనీ నాకొక్కటే. నేను మాత్రం నిర్వికల్పంగా ప్రేమిస్తాను.

* * *

ఇది రెండు సంవత్సరాలనాటి కథ. కాలం నా గాయాన్ని మాన్పలేకపోయింది. అది ఈనాటికీ పచ్చిపచ్చిగానే ఉంది. కాని ఇంకెంతకాలం ఉంటుంది?

మొదట్లో ప్రేమ నిష్కామమని నమ్మాను. కాని అనుభవపూర్వకంగా గ్రహించాను అది నిష్కామమెన్నటికీ కాదని. సుద్రఘం కాక పోతే నిర్వీర్యమై నశిస్తుంది కాని స్త్రీ పురుష ప్రేమ ప్రతిఫలాన్ని వాంఛిస్తుంది. అది తీవ్రతరమైతే మంచి చెడ్డ అన్న భేదం విడిచి కార్య సాఫల్యాని- కెక్కు మార్గాల్ని అన్వేషింప జేస్తుంది. దాన్ని జయించటమంటే సాధ్యమయ్యే విషయంకాదు. ఇక అనుక్షణమూ, అహరహమూ, ఈ జీవన్మృత్యు సంగ్రామం సాగించటం సాధ్యమాతుందా? అసాధ్యమనే నా ఉద్దేశం. కనుకనే అశ్వాసాంతం రచించ దలచుకొన్నాను. దీన్ని భీరుత్వమను, మరేమన్నా అను.

కాని కడపటి కోరికగా నిన్ను అర్థించేదేమంటే ఇందుతో పంపే జాబుల్ని — అవి ఆమె రాసిన లేఖలు— అవి ఆమెకి చేర్చు. తప్పకుండా ఆమె నన్ను మరచిపోయి ఉంటుంది. అవి ఇచ్చి, ఆమెసుఖమయ జీవితంలో తుపాను లేపటం నాకిష్టం లేదు. కాని నన్ను ఆఖరుసారిగా గుర్తు తెచ్చుకొని, జాలితో రెండశ్రుకణాలు తర్పణంగా వీడకలిగితే చాలు. ఇలా అర్థించటానికి నాకేమీ హక్కు లేదు కాని, అర్థిస్తున్నాను... సెలవు."

* * *

సత్యం, కృష్ణవేణివైపు చూచాడు. ఎండిపోయిన కళ్ళను తెరుస్తో కృష్ణవేణి కళ్ళ నీళ్లు తుడుచుకుంటో "ఆ జాబు నేను చదవలేదు కోపంతో చించివేశాను" అంది.

నేటి పరీక్షా రణరంగం

# ఒక రామకార్యం

"సుబ్బన్న"

"ఇదేమిటండీ జనం ఇలా గుమిగూడారు?" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించారు అమరేంద్ర.

"పరీక్షలు".

"పరీక్షలైతే గుంపుదేనికి?"

"అది ఈవూరి అలవాటు, మా దేశపుటాచారం."

విస్తుపోయి నాకేసి వింతగా చూశారు అమరేంద్ర. ఇంక వివరాలు విప్పిచెప్పకతప్పిందిగాదు.

"దీన్ని శారదాలయమంటారు. ఒకప్పుడీ సంస్థ 'ఒహో'యనిపించుకొన్నదే. బాలశారద సరిగంచు పావడాలిచట జీరాడినై. నిండు హృదయాలు 'ఝల్లు' మన ముగ్ధ శారద చిరుగజ్జెలు ఘల్లుమన్నదీ చవికె మీదనే. కవితాకుమారి వన్నెలు దిద్దుకొన్నది. ప్రౌఢ శారద పాండిత్య మొలకవోసింది ఈ చెట్ల నీడల్లో. అయితే... ఇపుడిదో పరీక్షా కదన రంగం. మీరు చూచేదో పద్మవ్యూహం. అదిగో ఆ ఎదురుగా నున్నదే - అదే ప్రేమ ప్రవాహాలు పొంగి ఘనీభవించి రూపొందిన క్రీస్తుదేవుని దేవాలయం. ప్రస్తుతం అదో కర్మాగారం పరీక్షా రణపరికరాలు తయారవుతున్నవాదులో